
సాక్షి
పల్నాడు
సోమవారం : 25 : ఆగస్టు : 2025



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: ఎగువ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు 3,92,500 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 3,90,500 క్యూసెక్కులు వదులుతున్నారు.



దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): కనక దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. తెల్లవారుజాము నుంచే వచ్చి ఆది దంపతులను దర్శించుకున్నారు.



అన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో అన్నదానానికి ఆదివారం గుంటూరు పాతపేటకు చెందిన కనూరు రత్నాకరరావు కుటుంబం రూ. 1,01,116 విరాళం ఇచ్చింది.

కూటమి పాలనలో రాక్షసత్వం

వినుకొండ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తపై హత్యాయత్నం

- బీసీ కుటుంబాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న టీడీపీ
- వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- ఐసీయూలో చికిత్స పొందుతున్న బాధితుడు వెంకటప్రసాద్
- కుటుంబసభ్యులను పరామర్శించిన వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు
- అధికారం శాశ్వతం కాదనే విషయం గుర్తుంచుకోవాలని టీడీపీకి హెచ్చరిక



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



వెంకటప్రసాద్ భార్య శ్రావణితో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు అంబటి మురళీకృష్ణ, వనమా బాలవజ్రబాబు, నూరిఫాతిమా



విలపిస్తున్న వెంకటప్రసాద్ కుటుంబ సభ్యులు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగాయని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎన్నడూ లేని విధంగా దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం టి.అన్నవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త వెంకట ప్రసాద్, ఆయన కుటుంబసభ్యులపై హత్యాయత్నాన్ని ఖండించారు. జిల్లాలో ఇలాంటి దారుణాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ సానుభూతి పరులపై కూడా రాక్షసత్వం చూపుతున్నారని ఆరోపించారు.

కొనసాగుతున్న చికిత్స

పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం టి.అన్నవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త వెంకటప్రసాద్, ఆయన కుటుంబసభ్యులపై శనివారం రాత్రి టీడీపీ మూకలు మరణాయుధాలు, కర్రలతో విచక్షణరహితంగా దాడులకు తెగబడ్డాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయాలపాలైన ఆయన్ను మెరుగైన వైద్యసేవల నిమిత్తం గుంటూరు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గాల సమన్వయకర్తలు అంబటి మురళీకృష్ణ (పొన్నూరు), షేక్ నూరి ఫాతిమా(గుంటూరు తూర్పు), వనమా బాల వజ్రబాబు (తాడికొండ), నాయకులు ఆదివారం ఆరా తీశారు. వెంకటప్రసాద్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

దాడులను ప్రోత్సహిస్తున్న సర్కార్

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ వెంకటప్రసాద్‌పై హత్యాయత్నాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు. ఇటువంటి దాడులను కూటమి ప్రభుత్వం ప్రోత్సహించడం సరికాదని చెప్పారు. అధికారం శాశ్వతం కాదని, ప్రభుత్వాలు మారుతుంటాయనేది ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. అనంతరం వెంకటప్రసాద్ భార్య శ్రావణి, సోదరి మాధవి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

'కూటమి'వి హత్యారాజకీయాలు

పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ వెంకట ప్రసాద్ ఎన్నికల్లో పార్టీ ఏజెంట్‌గా పని చేశారని పేర్కొన్నారు. అప్పటి నుంచి ఆయన కుటుంబాన్ని బెదిరించడం టీడీపీ సాధారణమైందన్నారు. కూటమి ప్రభుత్వం హత్యా రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. వెంకటప్రసాద్‌పై హత్యాయత్నం విషయాన్ని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వారికి పార్టీ అండగా ఉంటుందని ఆయన చెప్పారన్నారు. నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీసీ కుటుంబంపై కక్షసాధింపు

తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అరాచక పాలనకు శ్రీకారం చుట్టిందని ఆరోపించారు. వెంకటప్రసాద్ పార్టీ ఏజెంట్‌గా కూర్చోవడం పాపమా అని ప్రశ్నించారు. బీసీ కుటుంబంపై కక్షసాధింపు చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే వీటిని ప్రోత్సహించడం సరికాదన్నారు. ఇప్పటికైనా టీడీపీ సక్రమ పద్ధతిలో నడవాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులు సహించబోమన్నారు.

ప్రభుత్వం మారాక సమాధానం ఇస్తాం

గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ వినుకొండలో ఇలాంటి ఘటన రెండోదని చెప్పారు. గతంలో రషీద్‌ను ఎలా హత్య చేశారో అందరికీ తెలుసన్నారు. వెంకటప్రసాద్‌పై హత్యాయత్నం దారుణం అన్నారు. మహిళలని కూడా చూడకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరీ విచక్షణరహితంగా దాడులకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఐదేళ్ల తర్వాత ప్రభుత్వం మారుతుందని, అప్పుడు గిఫ్ట్ రూపంలో సమాధానం ఇస్తామని హెచ్చరించారు.

న్యూస్‌రీల్

30 నుంచి రాష్ట్ర స్థాయి క్యారమ్ పోటీలు



చిలకలూరిపేట: సీఆర్ క్లబ్ సౌజన్యంతో ఈనెల 30, 31వ తేదీలలో ఆంధ్ర రాష్ట్ర రెండవ ర్యాంకింగ్ క్యారమ్ టోర్నమెంట్‌ను ఆంధ్ర రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్, పల్నాడు జిల్లా క్యారమ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ చెప్పారు. పట్టణంలోని సీఆర్ క్లబ్‌లో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 150 మంది క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. విజేతలకు ట్రోఫీతోపాటు రూ.30 వేల నగదు బహుమతి అందజేస్తామన్నారు. టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్వీ రమణమూర్తి, అబ్జర్వర్‌గా గద్దె వేణు వ్యవహరిస్తారని తెలిపారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా నాకౌట్ పద్ధతితో పోటీలు జరిపి మొదటి ఆరు స్థానాలను ఎంపిక చేసి రాష్ట్ర జట్లను ఆంధ్ర రాష్ట్ర ప్యాట్రన్ చీఫ్ యాగంటి దుర్గారావు ప్రకటిస్తారని తెలిపారు. టోర్నమెంట్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చల్లగుంట్ల అజయ్‌బాబు మాట్లాడారు. టోర్నమెంట్‌కు సంబంధించి జిల్లాల కార్యదర్శులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్‌ను ఫోన్ నంబర్ 99511 15678లో సోమవారం సాయంత్రం 5 గంటలలోపు సంప్రదించాలన్నారు. సమావేశంలో సీఆర్ క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, గద్దే వేణు, బి.హరిబాబు పాల్గొన్నారు.


ఎరువుల గోదాంలో తనిఖీ



నాదెండ్ల: రైతుల అవసరాలను ఆసరా చేసుకుని ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు రీజియన్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కొమ్మాలపాటి చంద్రశేఖర్ చెప్పారు. గణపవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఎరువుల గోడౌన్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. నిల్వలు, ఆన్‌లైన్, రిజిస్టర్‌లోని వివరాలు పరిశీలించారు. సీఈవో పెడవల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ ఇప్పటి వరకూ యూరియా 20 టన్నులు పంపిణీ చేశామని, మరో 80 టన్నులు రావాల్సి ఉందని వివరించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎరువులు ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించినా, అక్రమంగా నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఏవో ఆదినారాయణ, సొసైటీ అధ్యక్షుడు పెంటేల శేషయ్య, ఏవో శ్రీలత ఉన్నారు.

నాగార్జునకొండకు పోటెత్తిన పర్యాటకులు

లాంచీస్టేషన్ ఆదాయం రూ.1,74,700



విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. లాంచీలలో కొండకు తరలి వెళ్లారు. దీంతో లాంచీస్టేషన్‌కు రూ.1,74,700 ఆదాయం చేకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు. అనంతరం మాచర్ల మండలంలోని అనుపు, ఎత్తిపోతల జలపాతాన్ని పర్యాటకులు ఆసక్తికరంగా వీక్షించారు.

ట్రాన్స్‌ఫార్మర్ పేలి పాత కార్లు దగ్ధం



పెదకాకాని: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో కార్లకు నిప్పు అంటుకుని కాలిపోయాయి. గుంటూరు ఆటోనగర్ మొదటి లైన్ రైల్వేగేటు సమీపంలో పలువురు షాపుల నిర్వాహకులు పాత కార్లు తెచ్చి విడిభాగాలు విక్రయించే వ్యాపారం చేస్తున్నారు. ఆదివారం కావడంతో ఆటోనగర్ నిర్మానుష్యంగా ఉంది. సాయంత్రం సమయంలో షాపుల ముందున్న ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా పేలి మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న షాపుల యజమానులకు, అగ్నిమాపక శాఖ అధికారులు అక్కడికి చేరుకున్నారు. చెలరేగిన మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.10 లక్షల విలువ చేసే 15 కార్లు కాలిపోయాయి.

ఆరోగ్యం మెరుగుకు వ్యాయామం ముఖ్యం

– 'సండే ఆన్ సైకిల్ ర్యాలీ'లో జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు



నరసరావుపేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం మెరుగు కోసం సైకిల్‌పై నిత్యం అరం గంట సమయమైనా వెళ్లాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల ప్రకారం ఆదివారం పోలీసు అధికారులు, సిబ్బందితో కలసి సండే ఆన్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి ర్యాలీని ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో ఆయన కూడా పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ... నేటి వేగవంతమైన జీవన శైలిలో రోజూ సైక్లింగ్, యోగా, వ్యాయామం, నడక వంటివి అలవాటు చేసుకోవాలని సూచించారు. అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, ఒకటి, రెండో పట్టణ సీఐలు చరణ్, హైమారావు, రూరల్ సీఐ రామకృష్ణ, ఆర్ఐలు గోపీనాథ్, కృష్ణ, రాజా, యువరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుబట్టి... 'కొలువు' కొట్టి..!

- ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన దంపతులు
- దూరవిద్యలో చదివినా ప్రతిభతో సాధించిన భర్త
- ఒకేసారి నాలుగు పోస్టులకు అర్హత పొందిన మరో యువకుడు



నాగిరెడ్డి, ఉదయశ్రీ దంపతులు

పిడుగురాళ్ల రూరల్: ఒక లక్ష్యం పెట్టుకొని దాని కోసం నిరంతరం కష్టపడి విజయం సాధించడానికి కొంతమంది మాత్రమే ముందుకు వెళ్తారు. గమ్యం చేరతారు. ఆ కోవకు చెందిన వారే వీరు. పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామానికి చెందిన నాగిరెడ్డి, ఉదయశ్రీ దంపతులు ఈ ఏడాది డీఎస్సీ పరీక్షలు రాశారు. వెలువడిన ఫలితాలలో ఇద్దరూ ఉద్యోగాలు సాధించారు. నాగిరెడ్డి పదో తరగతి తర్వాత ఇంటర్, డిగ్రీ దూర విద్యలో పూర్తి చేశారు. అంతటితో ఆగకుండా బీఈడీ కూడా చదివారు. సచివాలయ ఉద్యోగాలకు పరీక్ష రాసి ఉద్యోగం సాధించారు. అయినా అంతటితో ఆగలేదు. డీఎస్సీకి ప్రిపేర్ అవుతూనే ఉన్నారు. తనతోపాటు భార్యను కూడా విద్య వైపు నడిపించి డిగ్రీ, బీఈడీ పూర్తి చేయించారు. ఇద్దరు ఇటీవల డీఎస్సీ పరీక్షలు రాశారు. స్కూల్ అసిస్టెంట్‌గా సోషల్‌లో 73.72 మార్కులతో నాగిరెడ్డి జిల్లా స్థాయిలో 67వ ర్యాంకును, ఉదయశ్రీ కూడా 74.55 మార్కులతో జిల్లా స్థాయి 50వ ర్యాంక్ సాధించారు.

ఒకేసారి నాలుగు పోస్టులకు అర్హత



షేక్ జాకీర్ హుస్సేన్

పిడుగురాళ్ల పట్టణానికి చెందిన షేక్ జాకీర్ హుస్సేన్ కూడా డీఎస్సీ పరీక్షలు రాశారు. తాజాగా ప్రకటించిన ఫలితాలలో నాలుగు కేటగిరీలలో ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఎస్జీటీలో 90.74 మార్కులతో గుంటూరు జిల్లా స్థాయిలో నాలుగవ ర్యాంకు కైవసం చేసుకున్నారు. స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్‌లో 77.22 మార్కులతో గుంటూరు జిల్లా 27వ ర్యాంకు, టీజీటీ సోషల్‌లో 73.35 మార్కులతో జోన్ 3లో 16 ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్‌గా తెలుగులో 67.07 మార్కులతో జిల్లా స్థాయి 71వ ర్యాంకు సాధించారు. 2012-13 విద్యా సంవత్సరంలో మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన హుస్సేన్ ఒకేసారి నాలుగు ఉద్యోగాలకు అర్హత సాధించారు. పాఠశాల ఉపాధ్యాయులు, నాటి తరగతి స్నేహితులు ఆయన్ను అభినందించారు.

మూడు పోస్టులకు...



రత్నబాబు

ఫిరంగిపురం: డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని వేములూరిపాడు గ్రామానికి చెందిన జూపల్లి రత్నబాబు మూడు పోస్టులకు అర్హత సాధించారు. రాజారావు, మరియమ్మ దంపతుల కుమారుడైన రత్నబాబు ఎంపీపీ పాఠశాలలో ఐదవ తరగతి వరకు చదివారు. ఆరు నుంచి పది వరకు అమీనాబాద్‌లోని బీఆర్ హైస్కూలులో, ఇంటర్, డిగ్రీ గుంటూరులోని హిందూ కళాశాలలో, బీఈడీ నరసరావుపేటలో పూర్తి చేశారు. ప్రస్తుతం తెలంగాణలోని వరంగల్ ఎస్ఆర్ కళాశాలలో ప్రైవేటు లెక్చరర్‌గా పని చేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో ఎస్ఏ ఇంగ్లిష్‌లో 5వ ర్యాంకు, పీజీటీలో 6వ ర్యాంకు, టీజీటీలో 17వ ర్యాంకు సాధించి యువతకు ప్రేరణగా నిలిచారు. ఈ సందర్భంగా రత్నబాబు మాట్లాడుతూ.. 2024 ఫిబ్రవరిలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో నిర్వహించిన డీఎస్సీ పరీక్షకు హాజరయ్యేందుకు శ్రమించానని తెలిపాడు. అది రద్దు కావడంతో అప్పటి నుంచి పరీక్షల్లో ఉత్తమ ఫలితం కోసం కృషి చేస్తున్నట్లు చెప్పాడు. రత్నబాబుకు భార్య రత్నకుమారితో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రత్నబాబు విజయంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

బార్.. బేజార్

- జిల్లాలో 54 బార్‌లకు నోటిఫికేషన్ ఇస్తే ఇప్పటివరకు ఒక్కటీ రాని దరఖాస్తులు
- ఎల్లుండితో ముగియనున్న నిర్ణీత గడువు
- మల్లగుల్లాలు పడుతున్న అధికారులు
- వైన్స్‌కు పర్మిట్ రూమ్‌లు, వచ్చే మార్జిన్ తక్కువ కావడమే కారణం
- మరోవైపు కూటమి ప్రజాప్రతినిధులకు కప్పం కట్టాల్సిన దుస్థితి
- నష్టాలు వస్తాయని ముందుకు రాని మద్యం వ్యాపారులు
- దరఖాస్తు చేయాలని తీవ్ర ఒత్తిడి తెస్తున్న ఎక్సైజ్ అధికారులు
- అయినప్పటికీ కనిపించని స్పందన

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బార్ పాలసీకి స్పందన కరువైంది. నోటిఫికేషన్ ఇచ్చి వారం అవుతున్నా నేటికి ఒక్కటంటే ఒక్కటి కూడా దరఖాస్తు అందకపోవడం గమనార్హం. లైసెన్స్ ఫీజు తగ్గించాం.. ఆరు విడతలుగా ఫీజు చెల్లించేందుకు వెసులుబాటు కల్పించాం... అర్ధరాత్రి వరకు అమ్మకాలకు అనుమతిచ్చాం.. మీ వ్యాపారానికి మాది భరోసా.. అంటూ ఎక్సైజ్ శాఖ ఎంత ప్రోత్సహిస్తున్నా వ్యాపారులు మాత్రం ముందుకు రావడం లేదు.



నరసరావుపేట ఎక్సైజ్ కార్యాలయం

నరసరావుపేట టౌన్: మద్యం షాపుల కోసం పెద్ద ఎత్తున పోటీ పడ్డ వ్యాపారులు.. ఇప్పుడు బార్ల విషయానికి వచ్చే సరికి వెనక్కి తగ్గారు. ఊరూరా బెల్టు షాపులతోపాటు వైన్‌షాపులకు పర్మిట్ రూమ్‌లు ఇవ్వడంతో బార్ల నిర్వహణ అంత సులభం కాదని వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. వైన్స్ వద్ద విక్రయాల్లో సమయపాలన పాటించపోవడం కూడా మరో కారణంగా నిలుస్తోంది. ఇక కూటమి ప్రజాప్రతినిధులకు, నేతలకు కప్పం కట్టాల్సి రావడం కూడా ఇంకో కారణంగా తెలుస్తోంది. ఇప్పటికే వ్యాపారాలు చేయలేమంటూ గతంలో నరసరావుపేటలోని పలువురు బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు తమ దుకాణాలకు తాళాలు వేసి ఎక్సైజ్ కార్యాలయంలో ఆ తాళం చెవులు అప్పగించి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. మద్యం దుకాణదారులంతా కూటమి పార్టీలకు చెందిన వారు కావడంతో ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు అందినా చర్యలు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు జీరో మార్జిన్, భారీగా దరఖాస్తు ఫీజు, లైసెన్స్ ఫీజు ఉండటంతో నిర్వహణలో నష్టాలు వస్తాయని బార్‌ల వ్యాపారులు భావిస్తున్నారు. దరఖాస్తులు రాకపోవడంతో ఎక్సైజ్ అధికారులకు అవస్థలు తప్పడం లేదు. మద్యం వ్యాపారులపై ఒత్తిడి తెచ్చి దరఖాస్తు చేయించేందుకు చేసిన ప్రయత్నాలు కూడా ఫలించడం లేదు. మద్యం ఆదాయమే పరమావధిగా భావించిన ప్రభుత్వం బార్ల దరఖాస్తులలో అధిక రాబడి ఆశిస్తోంది. ఇతర జిల్లాలతో పోల్చితే పల్నాడు జిల్లాలో మద్యం, బార్ అండ్ రెస్టారెంట్ల సంఖ్య ఎక్కువగానే ఉంది.

స్పందన శూన్యం

పల్నాడు జిల్లాలో మొత్తం 54 బార్ అండ్ రెస్టారెంట్లకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో 49 సాధారణ, 5 ప్రత్యేకంగా గీత కార్మికుల కోసం కేటాయించారు. వీటిలో 49 బార్లకు ఈ నెల 26వ తేదీన, అయిదు బార్లకు 28వ తేదీన దరఖాస్తుకు చివరి తేదీగా నిర్ణయించారు. ఇంతవరకు ఒక్క బార్‌కు కూడా దరఖాస్తు అందలేదు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు, బార్ల నిర్వహణలో నిబంధనలే వ్యాపారులు ఆసక్తి చూపకపోవడానికి కారణంగా తెలుస్తోంది. పక్క రాష్ట్రం తెలంగాణలో లైఫ్ టైమ్ బార్ అనుమతికి రూ.లక్ష దరఖాస్తు ఫీజు కాగా.. ఇక్కడ ఫీజు ఏకంగా రూ.5 లక్షలుగా నిర్దేశించారు. దీంతోపాటు దరఖాస్తు ఫీజు పేరిట అదనంగా మరో రూ.10 వేలు వసూల్ చేస్తున్నారు. ప్రతి చోట విచ్చలవిడిగా బెల్టుషాపుల రూపంలో మద్యం లభ్యమవుతోంది. దీనికితోడు వైన్స్‌లలో పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేయనున్నారు.

ప్రజాప్రతినిధులకు 'కప్పం' అదనం

ప్రభుత్వ ఫీజులన్నీ ఒక ఎత్తైతే ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకోవడం మరో ఎత్తు. మద్యం దుకాణాల లాటరీ వ్యవహారంలో ఇతరులెవరు పాల్గొనకుండా కూటమి నేతలు బెదిరింపులకు పాల్పడ్డారు. దుకాణం దక్కినా బలవంతంగా లాక్కొన్నారు. వైన్స్ యజమానుల నుంచి భారీ మొత్తంలో కప్పం కట్టించుకుంటున్నారు. బార్ అండ్ రెస్టారెంట్ వ్యాపారం చేయాలన్నా ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకోక తప్పదు. నరసరావుపేటలో లిక్కర్ డాన్‌గా పేరొందిన ఇద్దరు వ్యాపారులు కూడా ఇప్పుడు దరఖాస్తు చేయడం లేదని చెబుతున్నారు.

దరఖాస్తుల సంఖ్య 216 దాటాల్సిందే...

బార్ల నోటిఫికేషన్‌లో ఇచ్చిన నిబంధన ఎక్సైజ్ శాఖకు శాపంగా మారింది. ప్రతి బార్‌కు తప్పనిసరిగా నాలుగు దరఖాస్తులు అందజేస్తేనే లాటరీ ప్రక్రియ చేపడతారు. లేకుంటే ఆయా బార్లకు తిరిగి దరఖాస్తులు ఆహ్వానించాల్సి ఉంటుంది. ఈ లెక్కన జిల్లాలో నోటిఫికేషన్ ఇచ్చిన 54 బార్లకు కనీసం 216 దరఖాస్తులు అందాలి. ఒక్కో బార్‌కు పది దరఖాస్తులు చేయించాలని అధికారులపై ప్రభుత్వం నుంచి ఒత్తిడి ఉన్నట్టు సమాచారం. మరో రెండు రోజుల్లో గడువు ముగుస్తుందనగా కనీసం ఒక్క దరఖాస్తు కూడా రాని దుస్థితి జిల్లాలో ఉంది. దీంతో జిల్లా ఎక్సైజ్ అధికారులు ఏం చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు. ఆదాయం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం టార్గెట్లు నిర్దేశించడంతో అధికారులు కూడా వ్యాపారుల వెంట పడుతున్నారు.

చీరాల రైల్వే స్టేషన్‌లో భారీగా గంజాయి పట్టివేత

పూరీ నుంచి తిరుపతి వెళ్లే రైల్లో 8 కేజీలు స్వాధీనం

చీరాల రూరల్: చీరాల రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఈగల్ టీమ్, రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఎస్సై సీహెచ్. కొండయ్య, ఆర్పీఎఫ్ ఎస్సై శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. చీరాల రైల్వే స్టేషన్‌లో పూరీ నుంచి తిరుపతి వెళ్లే బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ఈ తనిఖీలు చేపట్టారు. జనరల్ బోగీలో లగేజీని తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న పార్సిళ్లు కనిపించడంతో పరిశీలించారు. సుమారు 8 కేజీల గంజాయి వాటిలో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తర్వాత జీఆర్పీ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైలు తెలిపారు. గంజాయి, మాదక ద్రవ్యాలు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాపట్ల ఆర్పీఎఫ్ ఎస్సై మనోజ్‌కుమార్ రెడ్డి, చీరాల ఏఎస్సై కె. శ్రీనివాసరావు, బాపట్ల పట్టణ ఏఎస్సై నరసింహమూర్తి, పోతురాజు, చంద్రమౌళి, తిరుపతమ్మ, ఈగల్ టీమ్ దుర్గాప్రసాద్, సతీష్, డాగ్‌స్క్వాడ్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న ఈగల్ టీమ్, రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు

255 ల్యాప్‌టాప్‌లు చోరీ



మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జెడ్పీహెచ్ఎస్ సమీపంలో గల దాబా వద్ద నిలిపి ఉన్న కంటైనర్ నుంచి ల్యాప్‌టాప్‌లు దొంగిలించినట్లు బాధితుల ఫిర్యాదు మేరకు మేదరమెట్ల పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. హైదరాబాద్ నుంచి చెన్నైకు ల్యాప్‌టాప్‌ల లోడుతో వెళుతున్న కంటైనర్‌ను శనివారం మేదరమెట్ల కొండ సమీపంలోని ఓ దాబా వద్ద నిలిపారు. కంటైనర్ డ్రైవర్, క్లీనర్ అక్కడ నుంచి విశ్రాంతి కోసం వెళ్లిపోయిన వెంటనే.. దొంగలు కంటైనర్‌ను పగుల గొట్టి దానిలోని హెచ్‌పీ కంపెనీకి చెందిన 255 ల్యాప్‌టాప్‌లు, ఒక మానిటర్, ఒక టోనర్‌ను దొంగిలించుకుపోయినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం డ్రైవరు, క్లీనరు వచ్చి చూడగా విషయం తెలిసింది. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చీరాల డీఎస్పీ మొయిన్ స్థానికుల నుంచి వివరాలను సేకరించారు.

క్లుప్తంగా

టమోటా లోడు లారీ బోల్తా



మేదరమెట్ల: మొలకల చెరువు నుంచి మార్టూరుకు టమోటా లోడుతో వెళుతున్న మినీ లారీ పి.గుడిపాడు జాతీయ రహదారి ఎమర్జెన్సీ ల్యాండింగ్‌పై ఆదివారం బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా టమోటాలు రోడ్డుపై పడిపోయాయి. డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతో లారీ అదుపు తప్పింది. డివైడర్ కోసం ఉంచిన సిమెంటు దిమ్మెను ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్ పుంగనూరు గ్రామానికి చెందిన మునీశ్వర్‌కు స్వల్ప గాయాలు కాగా హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు



ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కొల్లూరు: కృష్ణా నది వరదల కారణంగా పంటలు మునకకు గురై ఏర్పడిన పంట నష్టానికి తోడు, అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్రా మాల్యాద్రితో కలసి ఆయన మండలంలోని పోతార్లంకకు చెందిన కౌలు రైతు కుటుంబాన్ని పరామర్శించారు. కృష్ణా నదికి వచ్చిన వరదల వల్ల కౌలు రైతు ఈడ్పుగంటి మురళీకృష్ణ 5.85 ఎకరాలలో సాగు చేసిన అరటి, పసుపు, కంద పంటలు ముంపు బారిన పడ్డాయని తెలిపారు. దీనికి తోడు పంటల పెట్టుబడుల కోసం రూ.15 లక్షల పైబడి బ్యాంక్‌లు, స్థానిక వ్యక్తుల వద్ద అప్పులు చేయడంతో, అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. పంటల సాగు అధిక శాతం కౌలు రైతులే చేస్తున్నారన్నారు. అటువంటి కౌలు రైతులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయడంలో, ఇచ్చిన కార్డులకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నందునే అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యక్తుల వద్ద రుణాలు తీసుకొని అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. కౌలు రైతులు, రైతుల ఆత్మహత్యలకు పరోక్షంగా బ్యాంక్‌లు, ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యమే కారణమని అన్నారు. ప్రభుత్వం నుంచి మృతుడి కుటుంబానికి అందాల్సిన రూ.ఏడు లక్షల పరిహారం కుంటి సాకులు చూపకుండా పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతుడి పిల్లలను కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పించి ఉచిత విద్యా బోధన చేయించడంతోపాటు, పీ–4 ద్వారా ఆ కుటుంబాన్ని దత్తత తీసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోళ్ల నాగరాజు, ప్రజాసంఘాల నాయకులు తోడేటి సురేష్, బి.సుబ్బారావు, పి.నాగమల్లేశ్వరరావు, పిల్లి మరియారావు, తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో జాతీయ యోగా పోటీలు

- 28 నుంచి ప్రారంభం
- నవోదయ విద్యాలయంలో మూడురోజుల ఆతిథ్యం
- దేశవ్యాప్తంగా ఎంపికైన ప్రతిభావంతుల రాక
- యోగా సాధకులు, అభిమానులకు పండుగే



మద్దిరాలలోని పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయం



విద్యాలయంలోని ఇండోర్ వేదిక

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: మొట్టమొదటిసారిగా జాతీయస్థాయి యోగా ప్రదర్శన పోటీలు పల్నాడు జిల్లాలో జరగనున్నాయి. ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు జవహర్ నవోదయ విద్యా సమితి షెడ్యూల్డ్ ఖరారైంది. జేఎన్‌వీల పరిధిలో జరిగే ఈ పోటీలకు చిలకలూరిపేట రూరల్ మండలం మద్దిరాల పీఎంశ్రీ జేఎన్‌వీ ఇందుకు వేదికగా మారనుంది. ఈనెల 28, 29, 30 తేదీల్లో వరుసగా మూడు రోజులు మద్దిరాల గ్రామంలో సందడి నెలకొననుంది. యోగా సాధకులు, గురువులు, యోగాభిమానులకు పెద్ద పండుగే కానుంది.

భారత్‌లోని అన్ని రాష్ట్రాల నుంచి...

భారతదేశంలోని నవోదయ విద్యాలయ సమితి 8 రీజియన్‌లకు చెందిన జేఎన్‌వీ విద్యార్థులు హాజరు కానున్నారు. భూపాల్, చండిఘర్, జైపూర్, హైదరాబాద్, లక్నో, పూనే, పాట్నా, షిల్లాంగ్ జేఎన్‌వీ రీజియన్ల పరిధిలో గతనెలలో ప్రాంతీయ స్థాయి యోగా ప్రదర్శన పోటీలు నిర్వహించాయి. ఆయా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనపరిచి విజేతలైన 336 మంది యోగా సాధకులు ఈ నేషనల్ యోగామీట్‌లో భాగస్వాములు కానున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 26 నుంచి ఒక్క తమిళనాడు రాష్ట్రం మినహా దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన యోగా జట్లు మద్దిరాల జేఎన్‌వీకు రానున్నాయి.

ఏఏ విభాగాలు..జట్ల వివరాలు..

పోటీలలో అండర్ –14, అండర్ –17, అండర్ –19 విభాగాల్లో వ్యక్తిగత, బృందాలుగా సాధకులు యోగా ప్రదర్శన కళను ప్రదర్శించనున్నారు. శారీరక సామర్థ్యాన్ని, ఏకాగ్రతను చాటే 'గ్రూప్ ఆసనయోగా', సంగీతానికి అనుగుణంగా చేసే కళాత్మక 'రిథమిక్‌యోగ', యోగాసనాలతో కూడిన కళాప్రదర్శన 'ఆర్టిస్టిక్‌యోగా' పోటీలు ఉంటాయి. యోగా సాధకులైన జేఎన్‌వీల విద్యార్థులు ఈ మూడు రకాల విన్యాసాలను మూడు వేదికపై కళాత్మకంగా ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయనున్నారు. దేశంలోని 8 రీజియన్ల నుండి 8 టీంలుగా వచ్చే 336 మంది యోగాసాధకులు ఆర్టిస్టిక్‌యోగాలో –6, రిథమిక్‌యోగా –6, గ్రూప్ ఆసనయోగా –48 విభాగాల్లో తమ యోగా విన్యాసా పాటవాలను పోటీల్లో ప్రదర్శించనున్నారు. ఈ పోటీల్లో విజేతలైన వారు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీలకు ఎంపికవుతారు.

నిర్వహణకు సన్నాహాలు

విద్యాలయంలో పోటీల నిర్వహణ ఏర్పాట్లపై ఇప్పటి నుంచే సన్నాహాలు మొదలయ్యాయి. పోటీల నిర్వహణ ప్రక్రియ విజయవంతం చేసేందుకు విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు పర్యవేక్షణలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, పీఈటీలు ఆర్ పాండురంగారావు, జి గోవిందమ్మ, అధ్యాపకులు సమన్వయంతో కృషి చేస్తున్నారు. ఇందుకోసం మూడు ప్రత్యేక వేదికలు సిద్ధమయ్యాయి. విద్యాలయంలోని ఇండోర్ ఆడిటోరియం ఒకటి కాగా, క్రీడామైదానంలో మరో రెండు వేదికలను పోటీల నిర్వహణ కోసం ఏర్పాటు చేశారు. ఆయా వేదికలపై ఒకేసారి యోగా ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 4 నుండి రాత్రి 8.30 గంటలకు నిర్విరామంగా కొనసాగేలా విద్యాలయ పీడీలు షెడ్యూల్డ్‌ను రూపొందించారు. జాతీయస్థాయి పోటీల నిర్వహణ ప్రారంభం, ముగింపు సభల్లో మద్దిరాల జేఎన్‌వీ విద్యార్థులు ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ఇందుకు హైదరాబాద్ నుంచి బ్యాండ్‌మాస్టర్, చిలకలూరిపేట నుండి డ్యాన్స్ మాస్టర్‌ను అధ్యాపకులు పిలిపించి తమ విద్యార్థులకు తర్ఫీదు ఇప్పిస్తున్నారు.

అంతిమ లక్ష్యం అదే..



ప్రధానంగా మానవ వ్యవస్థను అర్థం చేసుకునే విజ్ఞానశాస్త్రం యోగా ప్రక్రియ అని ఈ పోటీల ద్వారా విద్యార్థుల్లో అవగాహన కల్పించడమే అంతిమ లక్ష్యం. ఇది కేవలం జాతీయస్థాయి యోగా పోటీ మాత్రమే కాదు, భారతదేశంలోని వివిధ ప్రాంతాల విద్యార్థులు తమ కళను ప్రదర్శించడానికి, వివిధ సంస్కృతులను తెలుసుకోవడానికి లభించిన ఒక గొప్ప అవకాశమేనని చెప్పొచ్చు.

–ఎస్ నరసింహారావు,
ప్రిన్సిపాల్, మద్దిరాల పీఎంశ్రీ జేఎన్‌వీ

కూటమి ప్రభుత్వంలో దివ్యాంగులకు తీవ్ర అన్యాయం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: కూటమి ప్రభుత్వంలో దివ్యాంగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమం అనంతరం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 14 నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షలమంది దివ్యాంగులకు పింఛన్లు తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. నరసరావుపేట నియోజకవర్గంలో 850 మందికి తొలగించారన్నారు. కనీసం వారికి సదరం క్యాంపునకు రమ్మని పిలుపు కూడా ఇంతవరకు లేదని అన్నారు. ఇప్పటి వరకు ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వలేదని, తొలగించిన పెన్షన్ల మిగులు డబ్బుతో పెంచిన పెన్షన్ డబ్బును అందిస్తున్నారని, ఇది దారుణమైన అంశమని అన్నారు. రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు దందాలు చేస్తూ పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర హోంమంత్రి అనిత రూ.2 కోట్లు లంచం తీసుకొని జీవిత ఖైదీ అనుభవిస్తున్న శ్రీకాంత్‌ను పెరోల్‌పై విడుదల చేయడం సిగ్గుచేటన్నారు. ఈ పెరోల్‌కు గూడూరు ఎమ్మెల్యే సునీల్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సిఫార్సు లెటర్లు ఇవ్వడం మరింత దారుణమైన అంశమని అన్నారు. శ్రీశైలం, గుంటూరు–2లో మహిళలపై వేధింపులు కొనసాగుతున్నాయని, సౌమ్య అనే కేజీబీవీ స్కూల్ ప్రిన్సిపాల్‌పై అక్కడి టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ వేధింపులకు పాల్పటం వలన ఆమె ఆత్మహత్యయత్నానికి పాల్పడిందని గుర్తు చేశారు. అయినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని అన్నారు. అనంతపురంలో సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్‌పై అక్కడి శాసనసభ్యుడు బూతులు తిడుతూ కామెంట్లు చేశారని, ఆ సినిమాకు వెళ్లొద్దని ప్రజలకు ఆదేశాలు ఇచ్చారన్నారు. సినిమాలు వేరు, రాజకీయం వేరని, ఈ రకంగా శాసనసభ్యుడు మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

ఓపీఎస్ సాధనకు నేడు విజయవాడలో మహాధర్నా

యూటీఎఫ్ జిల్లా కమిటీ పిలుపు

నరసరావుపేట: డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు సాధనకు యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం విజయవాడ ధర్నాచౌక్ వద్ద నిర్వహించే మహాధర్నాలో నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని 2004 సెప్టెంబర్ ఒకటి నుంచి నియామకం పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు వర్తింపజేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని, అయితే 2003లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఫలితాలను వెల్లడించినప్పటికి ప్రభుత్వం నియామక ఉత్తర్వులు ఇవ్వడంలో ఆలస్యం చేసిందన్నారు. అభ్యర్థుల వైపు నుంచి ఎటువంటి తప్పిదాలు లేకపోయినప్పటికీ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు పాత పెన్షన్ పరిధిలో ఉండాల్సివచ్చిందన్నారు. ప్రభుత్వ అలసత్వం వల్ల నూతన పెన్షన్ విధానంలోకి నెట్టి వేయబడ్డారన్నారు. కేంద్ర ప్రభుత్వం మెమో నెంబర్ 57 ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు పరిచిందని అయితే రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ 11 వేల మందికి పాత పెన్షన్ అమలులో తీవ్ర జాప్యం చేస్తుందన్నారు. అధికారంలోకి రాక ముందు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అనేక సందర్భాలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారం లోకి వచ్చాక విస్మరించారన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల న్యాయబద్ధమైన సమస్య పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి పాత పెన్షన్ విధానం అమలుకు ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం దిగిరాకపోతే కలిసి వచ్చే ఉపాధ్యాయ సంఘాలను కలుపుకుని దశల వారీ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

మానవ రహిత భారత్ అమిత్‌షా లక్ష్యం

ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంజీరా జీవన సహచరి తాయమ్మ కరుణ, చంద్రశేఖర్ తదితరులు

సత్తెనపల్లి: వచ్చే ఏడాది మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత భారత్‌గా మారుస్తానని కేంద్ర హోం మంత్రి అమిత్ షా జోస్యం చెబుతున్నారని, వాస్తవానికి మానవ రహిత భారత దేశంగా మారుస్తారని ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది చిలుకా చంద్రశేఖర్ ఎద్దేవా చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని పీఎం రెడ్డి గార్డెన్స్‌లో మావోయిస్టు పార్టీ అమరుడు, మంజీరా పై వచ్చిన వివా కామ్రేడ్ రవి పుస్తకావిష్కరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సభకు విరసం కార్యదర్శి రివేరా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అంబానీ, అదానీల వంటి గుప్పెడు మంది కార్పొరేట్ ప్రయోజనాల కోసం మధ్య భారతంలో ఖనిజ వనరులను కొల్లగొట్టడానికి అడవులను నరికేసి పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. అందుకోసం ఆదివాసీ ప్రజా ప్రతిఘటన పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న మావోయిస్టులను చంపేస్తామని ప్రకటించడం ప్రపంచ చరిత్రలో ఇంతవరకు ఎప్పుడూ లేదని చెప్పారు. విప్లవ రచయితల సంఘం నాయకులు పాణి మాట్లాడుతూ మావోయిస్టు అమర వీరుడు, విప్లవ రచయిత మంజీరా సాహిత్యం, జీవితం త్యాగ పూరితమని వివరించారు. తొలుత ప్రజా కళామండలి కళాకారులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. మంజీరా జీవన సహచరి తాయమ్మ కరుణ వివా కామ్రేడ్ రవి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ, పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలి



పిడుగురాళ్ల: పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలని అంబేడ్కర్ ప్రచార సేవా సమితి డేగల అబ్రహం డిమాండ్ చేశారు. ఆదివారం దళిత సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరి అమర్ నాథ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దళిత మహాసభ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిల్లి చెన్నారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కూడా మేము ప్రభుత్వానికి అర్జీలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. జాషువా కళా సమితి అధ్యక్షుడు బత్తుల దాసు మాట్లాడుతూ గుర్రం జాషువా జిల్లా పెట్టాలని దళితుల కోరిక అన్నారు. గబ్బిలం అనే రచన ద్వారా జాషువా ప్రజలను చైతన్యం చేసినట్లు కొనియాడారు. 85 శాతం ప్రజల ఆకాంక్ష పల్నాడు జిల్లాకు జాషువా పేరు పెట్టాలని చెప్పారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా బలహీన వర్గాల ఐక్యవేదిక అధ్యక్షులు నల్లబోతుల రాజు, హ్యూమన్ రైట్స్ పల్నాడు జిల్లా వైస్ చైర్మన్ బి.జీవరత్నం, మాలమహానాడు పాశం శ్యామ్, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధ్యక్షులు జక్కుల కృష్ణయాదవ్, దళిత సేవా దళ్ తళ్లూరి సురేంద్ర పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో రభస

- తక్కెళ్లపాడులో ఘటన
- విగ్రహం వద్దకు చేరుకున్న బీసీవై పార్టీ ప్రతినిధులు
- ప్రతిఘటించిన నిర్వాహకులు
- పోలీసులు రంగ ప్రవేశం



బీసీవై పార్టీ ప్రతినిధులు, విగ్రహావిష్కరణ నిర్వాహకుల మధ్య వాగ్వాదం

పెదకాకాని: శ్రీకృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ వివాదానికి దారి తీసింది. పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడులో చెరువు కట్టపై శ్రీకృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం విగ్రహావిష్కరణ నేపథ్యంలో భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రయాదవ్ శనివారం అక్కడకు చేరుకున్నారు. యాదవులు, హిందువులు ఆరాధ్యదైవంగా భావించి పూజలు చేసుకునే శ్రీకృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేయడం అవమానించడమేనని తెలిపారు. దీనిపై పెదకాకాని పోలీసుస్టేషన్‌లో బీసీవై పార్టీ ప్రతినిధులు, అఖిల భారత యాదవ మహాసభ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. దీంతో నిర్వాహకులు రాత్రి 12 గంటల వరకూ చర్చలు జరిపారు. అదే విగ్రహం చేతిలో ఫ్లూటు, కిరీటంలో నెమలి పింఛం లేకుండా టీడీపీ నాయకులు ఆవిష్కరించారు. దీంతో ఫిర్యాదుకు సంబంధించి రశీదు పొందేందుకు ఆదివారం సాయంత్రం పోలీసుస్టేషన్‌కు చేరుకున్న బీసీవై పార్టీ ప్రతినిధులు అక్కడ నుంచి తక్కెళ్లపాడు వెళుతున్నట్లు పోలీసులకు సమాచారం అందించారు. గ్రామంలో విగ్రహావిష్కరణ సమయంలో ఏర్పాటు చేసిన మైక్ ద్వారా తక్కెళ్లపాడు విగ్రహావిష్కరణ వద్దకు కరాటే కల్యాణి వస్తుందని చెప్పడంతో 300 మంది దాకా అక్కడికి చేరుకున్నారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న బీసీవై పార్టీ నాయకులకు, విగ్రహావిష్కరణ కమిటీ ప్రతినిధులకు వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకుని బీసీవై ప్రతినిధులను అక్కడి నుంచి పంపించి వేశారు. విగ్రహాన్ని అదే చెరువులో సోమవారం 11 గంటలకు నిమజ్జనం చేద్దామని భారత చైతన్య యువజన పార్టీ అధినేత 'చలో తక్కెళ్లపాడు'కు పిలుపునివ్వడంతో విగ్రహావిష్కరణ వివాదం మరింత చర్చనీయాంశంగా మారింది.

జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షునిగా కేవీ రమణ

వినుకొండ: జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షునిగా కేవీ రమణ ఎన్నికయ్యారు. వేదిక మహాసభ ఆదివారం వినుకొండలో జేవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ అధ్యక్షతన నిర్వహించారు. జాతీయ పతాకాన్ని డాక్టర్ ఎల్ఎస్‌రావు, జేవీవీ పతాకాన్ని డి.వెంకట్రావు ఆవిష్కరించారు. జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామారావు మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలని కోరారు. అనంతరం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శిగా చలపతిరావు, కోశాధికారిగా డి.వెంకట్రావు, సహకార్యదర్శిగా జి.కమలారామ్, సలహాదారునిగా కె.ఆదినారాయణ, జిల్లా సమతా విభాగం కన్వీనర్‌గా కె.రేణుక, జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎ.నాగేశ్వరరావు, సభ్యులుగా బి.త్రివిక్రమ్, జె.శ్రీనివాసరావు, బి.రవికుమార్‌లను ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దార్ల బుజ్జిబాబు తెలిపారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో భానోజీకి తృతీయ స్థానం



సత్తెనపల్లి: రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన మాజీ కౌన్సిలర్ పులహరి భానోజీ ప్రతిభ చూపాడు. సత్తెనపల్లి శక్తి యోగ నిర్వాహకుడు రమేష్ ఆధ్వర్యంలో 6వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ యోగ ఆసనం స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్–2025 పోటీలు తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడులో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించారు. పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ పోటీల్లో సీనియర్ విభాగం 45–55 సంవత్సరాల విభాగంలో స్టేట్ లెవెల్ లో లెగ్ బ్యాలెన్స్ లో సత్తెనపల్లికి చెందిన పులహరి భానోజీ ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం దక్కించుకొని బహుమతి, మెడల్‌తో పాటు మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నాడు. ఫార్వర్డ్‌బెండ్ విభాగంలో సత్తెనపల్లికి చెందిన వల్లూరి శ్రీనివాసరావు, సుపైన్ విభాగంలో సత్తెనపల్లికి చెందిన పులికొండ శ్రీనివాసరావు చతుర్థ స్థానం దక్కించుకున్నారు. ట్విస్టింగ్ విభాగంలో ధనేకుల సాంబశివరావు ఐదో స్థానం కైవసం చేసుకున్నాడు. 35–45 సంవత్సరాల విభాగంలో ఫార్వర్డ్‌బెండులో ఎం.సునీల్ కుమార్ నాలుగో బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా విజేతలను పలువురు ప్రముఖులు, యోగ అభ్యాసకులు ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు.

విజయవంతంగా బీఎస్ఎన్ఎల్ ఫ్రీడం ప్లాన్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 30వేల మంది ప్లాన్‌లో చేరిక

నరసరావుపేట: ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ ఈ నెల ఒకటవ తేదీ నుంచి ప్రారంభించిన సరికొత్త ఫ్రీడం ప్లాన్ విజయవంతంగా నడుస్తుందని ఆ సంస్థ గుంటూరు బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ సప్పరపు శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము ఊహించిన దాని కన్నా అద్భుతమైన ప్రతిస్పందన ప్రజల నుంచి వస్తోందన్నారు. ఈ నెల 23వ తేదీ వరకూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ముప్పై వేల మందికి పైగా నూతన వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. ఈ ప్లాను కింద రూ.1తో 30 రోజుల వ్యాలిడిటి, అపరిమిత కాలింగ్, రోజుకి రెండు జీబీ డేటా, రోజుకు 100 మెసేజిలు, ఉచిత సిమ్ కార్డు అందిస్తోందన్నారు. ఏంఎన్‌పీ ద్వారా బీఎస్ఎన్ఎల్‌కు వచ్చే వినియోగదారులకు కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందన్నారు. ప్రస్తుతం గుంటూరు బిజినెస్ ఏరియా పరిధిలో 700పైగా ఫోర్‌జి టవర్లు పనిచేస్తున్నాయని, తద్వారా తమ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన డేటా, వాయిస్ కాల్స్ సేవలను అందించటానికి కృషిచేస్తున్నామని తెలిపారు. ఈ ఆఫరు ఆగస్టు 31తేదీతో ముగుస్తుందని, కావున ప్రజలందరూ మిగిలిన రోజులలో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, సిమ్ కార్డు కావలసిన వారు దగ్గరలోని బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

ప్రియుడితో కలిసి భర్త హత్య

గుంటూరు రూరల్: వివాహేతర సంబంధానికి భర్త అడ్డు వస్తున్నాడని ప్రియుడితో కలసి హత్య చేసిన ఘటనలో నిందితులను నల్లపాడు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. నగరంలోని సౌత్ డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జి.భానోదయ వివరాలు వెల్లడించారు. రూరల్ మండలం గోరంట్ల పరిధిలోని మేరీప్రియనగర్‌కు చెందిన మున్నంగి ప్రదీప్(43) కనిపించటం లేదని తల్లి రెజీనా గత వారం నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో ప్రదీప్ భార్య మరియమ్మ పెదకాకాని మండలం వెనిగళ్ల గ్రామానికి చెందిన యాదాల సాంబశివరావుతో కలసి ఉంటోందని గుర్తించారు. దీంపై ప్రదీప్ భార్యను పలు మార్లు మందలించినట్లు సమాచారం. ఆ కోణంలో విచారించగా మరియమ్మ తన ప్రియుడు సాంబశివరావుతో భర్తను హత్య చేయాలని పథకం వేసిందని తేలింది. ఈనెల 23న మరియమ్మ ప్రియుడు యాదాల సాంబశివరావు స్నేహపూర్వకంగా మద్యం తాగుదామని ప్రదీప్‌ను ఆటోలో తీసుకెళ్లాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం ప్రదీప్‌తో ఎక్కువ మొత్తంలో మద్యం తాగించి, అతడిని బొల్లాపల్లి మండలం నెహ్రూనగర తండా మార్గంలో గల మట్టిరోడ్డు వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ నిర్జన ప్రదేశంలో ప్రదీప్‌ను కర్చీఫ్‌తో ముక్కు, నోరు మూసి, లుంగీ ముక్కను మెడకు చుట్టి హత్య చేశాడు. ప్రదీప్ మరణించిన సమాచారాన్ని మరియమ్మకు తెలుపగా, ఆమె జాగ్రత్తగా ఆధారాలు లేకుండా చేసి రావాలని చెప్పినట్లు నిందితుడు విచారణలో తెలిపాడు. విచారణలో నిందితులు ఇద్దరు హత్యానేరాన్ని ఒప్పుకోవడంతో పోలీసులు అరెస్ట్ చేసి, కోర్టుకు అప్పగించగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. నిందితులిద్దరిని 14 గంటల్లోనే అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును చాకచక్యంగా పరిష్కరించిన నల్లపాడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది యానాది, మస్తాన్, భిక్షాలు నాయక్‌లను జిల్లా ఎస్పీ అభినందించినట్లు ఆయన చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



శంకర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

రెంటచింతల: మండలంలోని గోలి గ్రామ శివారులో ఉన్న నాగమయ్యస్వామి దేవస్థానం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కాంట్రాక్ట్ డ్రైవర్ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాలు.. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన ముక్కా శంకర్(55) మండల పరిధిలోని పరాశక్తి సిమెంట్ కర్మాగారంలో 2009 నుంచి కాంట్రాక్ట్ పద్ధతిపై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడు శంకర్ కుమార్తె నివేదితను నడికూడిలో హైదరాబాద్ వెళ్లే రైలు ఎక్కించి ద్విచక్రవాహనంపై తిరిగి పరాశక్తి ఫ్యాక్టరీకి వెళ్తుండగా వాహనం అదుపుతప్పి పంటకాలువలో పడటంతో అక్కడకక్కడే మృతిచెందాడు. పంచనామా నిమత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మృతుని భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.